# తీవ్రరూపం దాల్చిన చిత్తూరు లోక్‌సభ ఎన్నిక

## ఎవరుగెల్చినా 2 వేలుమెజారిటీతోనే

చిత్తూరు ఉపఎన్నికలో పోలింగుతేది సమీపిస్తున్నకొద్దీ ఉభయపక్షాల కోలాహలం, సంరంభం పెరుగుతున్నది. గత 10 రోజులనుండి కాంగ్రెస్ ప్రచారం ముమ్మరంగా ప్రారంభం అయింది. కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ సంజీవయ్య రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యతోకూడా పర్యటించిపోయారు. ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి, మంత్రులు శ్రీ పి. వి. సుబ్బారెడ్డి, శ్రీ బలరామరెడ్డి నియోజకవర్గంలో ప్రవేశించారు. మంత్రులు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య, శ్రీ పి. వి. జి.రాజు, శ్రీ శివరామప్రసాద్, శ్రీ మీర్ అహమ్మద్ అలీఖాన్, శ్రీమతి సదాలక్ష్మి, డాక్టర్ యం. లక్ష్మీనరసయ్య, శ్రీ యం. ఆర్. అప్పారావు యీవారంలో వస్తారు.

శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య 8 రోజులపాటు మదనపల్లెలో మకాంచేస్తారు. శ్రీ మీర్ అహమ్మద్ అలీఖాన్, శ్రీమతి సదాలక్ష్మి 23 తేదీ వరకు, శ్రీ యం. ఆర్. అప్పారావు 24 తేదీ వరకు ఉంటారు.

వీరుగాక మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్, మంత్రి శ్రీ కక్కన్ వచ్చిపోయారు. శ్రీ భక్తవత్సలం 2 రోజులు పర్యటిస్తారు. మైసూరు రెవిన్యూమంత్రి శ్రీ యం. వి. కృష్ణప్ప పర్యటించిపోయారు.

అంతేగాక - కమ్యూనిస్టు నాయకులు శ్రీ తరిమెల నాగిరెడ్డి, శ్రీ మాకినేని బసవపున్నయ్య కాంగ్రెసుకు మద్దతుగా ప్రచారం చేసిపోయారు. పీలేరునుండి 100 మంది కమ్యూనిస్టు స్వచ్ఛంద సేవకులు కాంగ్రెసుకు మద్దతుగా గ్రామాలలో ప్రచారానికి పూనుకున్నారట.

కాంగ్రెసువారు బుర్రకథలు, హరికథలు ఏర్పాటుచేయడమేగాక హైదరాబాద్‌నుండి దాదాపు 20 మంది స్వచ్ఛంద సేవికలను కూడా ప్రచారంకోసం తీసుకొనివచ్చారు.

ఇక స్వతంత్రపార్టీ తరపున శ్రీమతి భారతీదేవి రంగా, శ్రీ గౌతు లచ్చన్న నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచారి 17 తేదినుండి 8 రోజులు పర్యటిస్తారు.

ఉధృతమైన కాంగ్రెస్ ప్రచారంతో బాటు ముఖ్యమంత్రి పట్టుదలకూడా గట్టి పడుతున్నట్లున్నది. ఏలాగైనా యీ

**మా ప్రత్యేక పరిశీలకుడు**

ఉపఎన్నికలో గెలిచితీరాలని ఆయన కృతనిశ్చయంతో ఉన్నారట. ఇటీవల చిత్తూరులో గ్రామోద్యోగుల యిష్టాగోష్ఠి సమావేశంలో ముఖ్యమంత్రి తన కృతనిశ్చయాన్ని వెల్లడించారని ఒక వదంతి. పట్టణంలోని ఒక సినిమా హాలులో ముస్లింలను కలుసుకున్నప్పుడు 'నేను ముఖ్యమంత్రినేగాక హోం మంత్రిని కూడా' అని అన్నారట.

ఇదిగాక వైశ్యుల ఓట్లకోసం మంత్రి శ్రీ కె. వి. గురుమూర్తి ఉపన్యాసం, బలిజ కులస్థుల నిమిత్తం మంత్రి డాక్టర్ లక్ష్మీనరసయ్య, శ్రీ మేడూరి నాగేశ్వరరావు ఉపన్యాసాలు ఏర్పాటుచేయబోతున్నారని వినికిడి. ముస్లింల ఓట్లకోసం మంత్రి శ్రీ మీర్ అహమ్మద్ అలీఖాన్ ద్వారా కృషి జరుగవచ్చు.

గతఎన్నికలకు ముందు ద్రావిడ మున్నేత్రకజగంనుండి చీలిపోయిన శ్రీ సంపత్ నెలకొల్పిన తమిళజాతీయపక్షం కూడా కాంగ్రెసును బలపరుస్తున్నది. కాని వీరివలనకలిగే బలం స్వల్పమైనది.

గతవారంలో కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ సంజీవయ్య పర్యటనతర్వాత హరిజనుల్లో మార్పువచ్చిందని అంచనా వేస్తున్నారు. ఆయన ఉపన్యాసాలు హరిజనుల మనస్సుల్లో నాటుకునేటట్లు ఉండినవట. మొత్తం మీద ప్రత్యర్థి నిగూర్చి చులకనగా వ్యంగ్యంగా మాట్లాడకుండా హుందాతనంతో తన పర్యటన, ప్రచారం సాగించారు.

ఈవారం పరిస్థితినిబట్టి పోటీ తీవ్రంగా ఉంటుందని నిస్సంశయంగా చెప్పవచ్చు. ఎవరు గెల్చినప్పటికి 2 వేల మెజారిటీ లోపుగా ఉంటుందనికూడా అంచనా వేస్తున్నారు.

కొన్నినియోజకవర్గాల వారీగా పరిస్థితి యిట్లా ఉంటుందని పరిశీలకుల అంచనా:

వేపంజేరి:—ఇక్కడ కాంగ్రెస్ స్వతంత్రపార్టీలకు చెరిసగం ఓట్లువస్తాయని భావిస్తున్నారు. కాని ఒక చిక్కు ఉన్నది. ఏమంటే లోగడ కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఓటుచేసినవారు యిప్పుడు కాంగ్రెసుకు అనుకూలంగా, లోగడ కాంగ్రెసుకు ఓటు చేసినవారుస్వతంత్రపార్టీకి ఓటుచేయవలసి ఉన్నది. మరొక ముఖ్యవిశేషం: యింత వరకు ఎడమొగం పెడమొగంగా ఉండా వచ్చిన శ్రీ పట్టాభిరెడ్డి శ్రీ చెంగల్రాయ నాయుడిమధ్య సామరస్యం ఏర్పడింది.

తవణంపల్లె:— ఉభయపార్టీలకు చెరిసగం లేదా స్వతంత్రపార్టీకి అత్యల్పమైన మెజారిటీ రావచ్చు.

చిత్తూరు:—క్రిందటి ఎన్నికల్లో స్వతంత్రపార్టీ అభ్యర్థికి 22 వేల మెజారిటీ వచ్చింది. కాని ఆనాటి కారణాలు, పరిస్థితులువేరు. ఈ నియోజకవర్గంలో ద్రావిడ మున్నేత్రకజగం బలం గణనీయమైనది. ఇన్నాళ్లవరకు వారు చలనం లేకుండా ఉండిపోయారు. చిత్తూరు కాపురస్థుడు శ్రీ సి. వి. నాయుడు వేలూరు జైలులో ఉన్న కజగం నాయకుడు శ్రీ అన్నాదొరైను కలుసుకోవడం, తిరుచెంగోడు లోక్‌సభ ఉపఎన్నికలో కజగం గెలుపువల్ల యీ వారం వారు స్వతంత్రపార్టీకి మద్దతుగారంగంలోకిదిగారు. [illegible] గెలుపుకు యీ నియోజకవర్గమే ఆయువుపట్టు—అనగా యిక్కడ లభించే మెజారిటీపై ఆధారపడి ఉంటుంది. కాని కాంగ్రెస్ వారుకూడా కజగంవారి ఓట్లు చీల్చడానికి సర్వశక్తులు వినియోగించే అవకాశం లేకపోలేదు.

మిగత నియోజకవర్గాల వివరాలు వచ్చేవారం.

---

## గుంటూరు వార్తలు

మా విలేఖరి

### స్వాతంత్ర్య దినోత్సవం

ఆగస్టు 15 తేదీన గుంటూరు పట్టణ పౌరులుగూడ స్వాతంత్ర్య దినోత్సవమును వేడుకగా జరుపుకున్నారు.

కలెక్టరాఫీసుఆవరణంలో జిల్లా కలెక్టరు శ్రీ ఆర్. యమ్. శాస్త్రిగారు పతాకావిష్కరణం గావించారు. చైర్మన్ శ్రీ పొన్నూరు కోటారెడ్డి, శ్రీ పి. వి. రెడ్డిగారలు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, స్వాతంత్ర్యఫలితంగా దేశంలో నేడు జరుగుతున్న ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి, యీ కృషిలో ప్రభుత్వంతో సహకరించవలసినదిగా ప్రజలకు ఉద్బోధించారు.

గుంటూరు మున్సిపల్ ఆఫీసు ఆవరణంలోగూడ స్వాతంత్ర్య దినోత్సవం జరిగింది. చైర్మన్ పొన్నూరు కోటారెడ్డిగారు జాతీయ పతాకమును ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీ వై. వి. రమణారెడ్డి, కౌన్సిలర్ శ్రీ [illegible] గారలు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

స్థానిక విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటుసంస్థలు ఉచితరీతిన స్వాతంత్ర్య దినోత్సవములు జరిపాయి.

బజారులో శాంతిసేవాసంఘం తరఫున శ్రీ షేక్ బాషాసాహెబ్‌గారిచే బహూకరించబడిన గాంధీజీ శిలావిగ్రహమును చైర్మన్ శ్రీ పి. కోటారెడ్డి మాలాలంకృతం గావించారు.

---


# కోప్ ఫాబ్రిక్స్

## చేనేత వస్త్రాలు

* * *

నూతనమైన డిజైన్లలో చీరెలు, జాకెటు గుడ్డలు, షర్టింగులు, దుప్పట్లు వగైరాలు.

· చలువచేసి, క్యాలండరు చేయబడిన మల్లులు, లాంగ్‌క్లాత్, కలరు పాప్లీను, మజిన్లు, చెక్ షర్టింగులు కొత్తగా విడుదలయినవి.

* * *

పక్కా రంగులు - ఎక్కువ మన్నిక

సరసమయిన ధరలు

రూ. 1కి 5 నయాపైసలు రిబేటు యివ్వబడును.

ఆంధ్రప్రదేశ్ అంతటాగల మా విక్రయశాలలలో లభించును.

## ఆంధ్రదేశ చేనేత సహకార సంఘము

## లిమిటెడ్, విజయవాడ - 2

